క్లుప్తంగా

ఎన్నిక


ముత్యాల స్వామి

దుగ్గొండి : మండలంలోని చాపలబండ గ్రామంలో మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముత్యాల స్వామి, ఉపాధ్యక్షుడిగా సోనబోయిన రాజు, కార్యదర్శిగా బొగ్గుల దేవేందర్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఎన్నికల అధికారి సాయిరాం ఎన్నిక ధ్రువపత్రాలు అందించారు. అనంతరం ముత్యాల స్వామి మాట్లాడారు. ప్రతి ముదిరాజ్ కార్మికుడికి భృతి కల్పించే విధంగా కృషి చేస్తానన్నారు.

చెక్కు పంపిణీ



చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన గడ్డం రాజుకు వైద్యం ఖర్చుల కోసం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో రూ.44వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బుర్ర సుదర్శన్ గౌడ్, సర్పంచ్ లక్ష్మీవెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మొగిళి రమాదేవి, ఉప సర్పంచ్ మేడి వెంకన్న, ధర్మతండా అంగోత్ అరుణ, వీరాసింగ్, మజ్జిగ రాంబాబు, యాకూబ్, విఠల్, తదితరులు ఉన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు..

ఖానాపురం : నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఆర్ఐ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడారు. ఉదయం 10గంటలకు చెక్కులను అందజేస్తారని తెలిపారు. ఎస్టీ-27, బీసీ-17, ఎస్సీ-6, షాదీముబారక్ 5 చెక్కులు మంజూరు అయ్యాయని తెలిపారు.

ఆర్థికసాయం


సరుకులు అందిస్తున్న తోటి స్నేహితులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కండక్టర్‌కు తోటి ఉద్యోగులు రూ.లక్ష ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర సరుకులు గురువారం అందించారు. సంగెం మండలం రాంచంద్రాపురం గ్రామానికి చెందిన స్వామికి రెండు కిడ్నీలలో రాళ్లు వచ్చి ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం రెండు సంవత్సరాలుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీంతో ఆయన కుటుంబం గడవడం కష్టంగా ఉండడంతో నర్సంపేట డిపో కార్మిక మిత్ర బృందం గొలనకొండ వేణు ఆధ్వర్యంలో కార్మికులు, రిటైర్డు ఉద్యోగులు, అద్దె బస్సుల కార్మికులంతా కలిసి నగదు, సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బొడిగె రాజు, ఏఎంరావు, ఓరుగంటి కొమ్మాలు, టీఎస్ సింగ్, ఓరుగంటి శంకర్, కొత్తపల్లి రవీందర్, ఏపీ రావు, డీసీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

చొప్ప తిని గొర్రెలు మృతి

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని కొంకపాకలో గొర్రెలు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొంకపాక గ్రామ శివారులో గొర్రెలను కాపరులు మేతకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో పజొన్న చొప్ప తినగా గ్రామానికి చెందిన చేగొండ యాదగిరికి చెందిన 13 గొర్రెలు, ఎల్లయ్యకు చెందిన 15గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో గొర్రెలు మృత్యువాత పడడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పశువైద్యాధికారి నరేష్‌ను వివరణ కోరగా గురువారం ఉదయం రైతు ఇచ్చిన సమాచారం మేరకు గొర్లకు వైద్యం చేశామన్నారు.

ఆక్రమించుకునే నైజం అరూరిది..

వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్ ఇంటి పేరునే అవినీతిగా మార్చుకున్నాడని నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ ధ్వజమెత్తారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్ర గురువారం రాత్రి వర్ధన్నపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పేదలకు మాత్రం ఇళ్లు ఇవ్వలేదని అన్నారు. అయితే ఊరూరా ఆయనకు మాత్రం ఇళ్లు ఉన్నాయని తెలిపారు. భూములను ఆక్రమించుకున్నాడు, చివరకు దళితనేత మంద కృష్ణ మాదిగ భూమిని సైతం ఆక్రమించుకున్నాడని తెలిపారు. అలాగే ములుగు ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనను ప్రశ్నిస్తున్న రేవంత్‌రెడ్డిని తట్టుకోలేక పోతున్నారని అన్నారు. తెలంగాణను సోనియా గాంధీ ఇచ్చింది నిజం కాదా.. అని తెలిపారు. దోపిడి పరిపాలనను తుదిముట్టించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కోతలు ఉన్నాయని వివరించారు. అనంతరం మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఇల్లు ఎవరికి ఇవ్వలేదు. కానీ ఆయన మాత్రం అన్ని మండల కేంద్రాల్లో ఇంద్రభవనం లాంటి క్యాంపు ఆఫీసులు నిర్మించుకున్నాడని చెప్పారు. ఎమ్మెల్యే అక్రమ సంపాదనను నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

ఆర్టీ‘ఛీ’ బస్టాండ్

- ఆవరణలో పేరుకుపోయిన చెత్తా చెదారం
- ఆదాయం ఉన్నా.. అభివృద్ధి సున్నా..
- బస్టాండ్ లోపలికి రాని బస్సులు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం


నెక్కొండ మండల కేంద్రంలోని బస్టాండ్


బస్టాండ్ ఆవరణలో పందుల స్వైరవిహారం

నెక్కొండ : ఆర్టీసీని ఆదరించండి.. ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితమైన ప్రయాణం అని గొప్పలు చెప్పే అధికారులు నెక్కొండ మండల కేంద్రంలో ఉన్న బస్టాండ్ అభివృద్ధిని మరిచారు. ప్రతినెలా ఆదాయం.. ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. అటు అధికారులు.. ఇటు ప్రజా ప్రతినిధులు పట్టింపు లేని కారణంగా సమస్యలకు నిలయంగా మారింది. జిల్లాలోనే ఏకైక రైల్వే స్టేషన్ ఉన్న నెక్కొండ నుంచి సుదూర ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రైలు దిగిన ప్రజలు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడి బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కూడా లేని పరిస్థితి. ప్రతి యేటా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల ద్వారా నెక్కొండ బస్టాండ్‌కు ఆదాయం అంచనాలకు మించి ఉంది. దీంతోపాటు బస్టాండ్ ఆవరణలో (ప్రధాన రోడ్డుకు) నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దె రూపంలో ప్రతి నెలా రూ.70 వేలు సంస్థకు చెల్లిస్తున్నారు.

సమస్యలకు నెలవు..

విద్యుత్ సౌకర్యం, తాగు నీరు లేదు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక, బస్సులు సైతం బస్టాండ్ లోపలికి రాకపోవడంతో ఎవరూ ఇటువైపు కన్నెత్తి చూడరు. దీంతో చికెన్ వ్యర్థాలు, వ్యాపార సముదాయాల నుంచి చెత్తా చెదారాలకు నిలయంగా మారడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఎలాంటి పరిశుభ్రత చర్యలు తీసుకోక పోవడంతో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బస్టాండ్ అంతా డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. దీనికి తోడు అటు అధికారులు, పాలకుల పట్టింపు లేక పోవడంతో ప్రైవేట్ వ్యక్తులకు అడ్డాగా మారిందని విమర్శలు వినవస్తున్నాయి. రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు బస్టాండ్ అభివృద్ధిపై దృష్టి సారించాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. బస్టాండ్ ప్రాంగణంలో చెత్తా చెదారం వేసే వారిని గుర్తించి జరిమానా విధిస్తాం. అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- విజయమాధురి, డీఎం, నర్సంపేట

ఆదాయం ఉన్నా అభివృద్ధి లేదు



చిరువ్యాపారుల నుంచి ఆర్టీసీ అధికారులు ముక్కుపిండి అద్దె వసూలు చేస్తున్నారు. ప్రతి నెలా ఆదాయం ఉన్నా అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బస్టాండ్‌కు బస్సుల రాకపోకలు లేక పోవడంతో చిరువ్యాపారులు ఆర్థికంగా చితికి పోతున్నారు. అధికారులు స్పందించి సమస్యలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలి.

-కందిక చెన్నకేశవులు, నెక్కొండ

కాంగ్రెస్ వస్తేనే సంక్షేమానికి పెద్దపీట

- హాథ్ సే హాథ్ జోడోయాత్రలో
- మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


గౌడన్నలతో ఆప్యాయంగా మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట రూరల్ : తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చామని చెబుతున్న కేసీఆర్‌కు రెండుసార్లు అవకాశం ఇస్తే ప్రజలను మోసం చేశారని, కానీ ఈసారి మాత్రం కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి గెలిపిస్తే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాకుండా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని పోచమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 6, 7, 8, 9 వార్డులలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను గురువారం నిర్వహించారు. మాధవరెడ్డికి మహిళలు హారతి ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలతో వారు మోసపోయారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి, గిరిజనులకు 12శాతం రిజర్వేషన్, రైతులకు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ విద్య, ఆరోగ్యశ్రీ, పాత్రికేయులకు ఆరోగ్య భద్రత కార్డులు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ ఖాళీలన్నింటి వెంటనే భర్తీ చేస్తామన్నారు. మహిళలకు రూ. 500లకే గ్యాస్ అందిస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు దొంతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్, మార్కెట్ మాజీ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్, ఓర్సుతిరుపతి, కర్నాటి పార్వతమ్మ, మొగిళి వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి


దుగ్గొండి: పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్


ఖానాపురం: సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

దుగ్గొండి : మండలంలోని బొబ్బరోనిపల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ శంకేషి శోభారాణి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. రోజుకు 300 మందికి పరీక్షలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్‌రాజు, పవన్, కమలాకర్, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సన్మానం

ఖానాపురం : మండలంలోని నాజీతండాలో కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందిని గురువారం సర్పంచ్ బాలకిషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్ నాయక్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కళావతి

సంగెం : మండలంలోని చింతలపల్లిలో ఉపాధిపథకంలో భాగంగా చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కళావతి గురువారం ప్రారంభించారు.కార్యక్రమంలో సర్పంచ్ ఇండ్ల రవికుమార్, ఎంపీటీసీ బొమ్మ పావని యుగేందర్, ఉప సర్పంచ్ బండి రాధిక, సొసైటీ చైర్మన్ బొమ్మ వెంకటేశ్వర్లు, నాయకులు మహేందర్, కుమారస్వామి, శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

‘సఖి’ సెంటర్‌కు మహిళ అప్పగింత


మహిళను అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఖానాపురం : మతి స్థిమితం లేని ఓ మహిళను ఐసీడీఎస్ అధికారులు చేరదీసి సఖి సెంటర్‌కు తరలించారు. గురువారం మండల కేంద్రంలో మతి స్థిమితం లేని ఓ మహిళ పెద్దమ్మగడ్డ రోడ్డులో కూర్చుని ఉంది. ఈ క్రమంలో అటువైపుగా వెళ్తున్న ప్రజలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ, స్థానిక పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. మహిళ ఉన్న ప్రదేశానికి ఐసీడీఎస్ అధికారులు వెళ్లి వివరాలు సేకరించడానికి ప్రయత్నం చేశారు. సమాచారం తెలుపకపోవడంతో 181కి కాల్ చేసి సఖి సెంటర్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగమణి, మల్లికాంబ, ఇందిరా, హైమావతి, ఆశ విజయ, హెల్పర్ శ్రీదేవి ఉన్నారు.

పరామర్శ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని 16వ వార్డుకు చెందిన ఆశ కార్యకర్త హన్మకొండ విజయ భర్త హన్మకొండ సదానందం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతదేహంపై బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బోడ రజిత, జిల్లా నాయకురాలు లత మంజుల, సరిత తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన కుండె అనూష అనారోగ్యంతో మృతి చెందింది. కాగా కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని బూర్గుమల్ల గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే రమేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

ఖానాపురం : శాంతి భద్రతల రక్షణకు కృషి చేయాలని డీసీపీ పుల్లా కర్ణాకర్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి, స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని అన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ సంపత్ రావు, రూరల్ సీఐ సూర్య ప్రసాద్, ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సర్పంచ్

సంగెం : రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లెబోయిన కిశోర్‌యాదవ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సంగెం మండలంలోని ఆశాలపల్లి సర్పంచ్, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడైన కిశోర్ హైదరాబాద్‌లో మంత్రిని కలిసి యాదవుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని విన్నవించారు. గొర్రెలు, మేకల పెంపకానికి షెడ్లు, మేత కోసం బంజరు భూములను కేటాయించి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు.

అధికారుల సూచనలు పాటించాలి


వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్

ఖానాపురం : వరి సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి భోగ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని మనుబోతులగడ్డ, బండమీదిమామిడి తండా, జాలుబంధం, చిలుకమ్మనగర్ గ్రామాల్లో గురువారం పంట క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందస్తుగా నాట్లు వేసిన వరి పంటలో కాండం తొలిచే పురుగు ఆశించిందని, అక్కడక్కడ జింక్ సూక్ష్మ పోషక ధాతులోపం ఉన్నట్లు తెలిపారు. నివారణకు నాటు వేసిన 25రోజుల లోపు ఫ్రీజి గుళికలు ఎకరానికి 10కిలోల చొప్పున ఇసుకతో కలిపి చల్లుకుంటే మొగి పురుగు, గొట్టాల తీవ్రత తగ్గనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నూకల సంతోష్, రైతులు బాలరాజు, రమేష్, శంకర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం


నెక్కొండ: స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు


గీసుకొండ: గొర్రెకుంటలో..

నెక్కొండ : విద్యార్థులు చదువులో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ వి.రత్నమాల అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చక్కని వేషధారణలతో పలువురిని ఆకట్టుకున్నారు. స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. అనంతరం విద్యార్థులకు ఎంఈఓ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంగా వందన, ఎంఈఓగా వర్ష వ్యవహరించారు. న్యాయ నిర్ణేతలుగా బాలాజీ, రజినీ, హైస్కూల్ హెచ్ఎం రంగారావు, హెచ్ఎం జాన్‌నాయక్, ఉపాధ్యాయులు ఐలయ్య, భారతి, గంగాధర్, రాజేందర్, సీఆర్పీ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించి మన్ననలు పొందారు. హెచ్ఎంగా మునిగాల సింధు, డీఈఓగా నక్క అభిలాష్‌లు వ్యవహరించగా హెచ్ఎం పి.అనిత, పీఈటీ రఘువీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చిన నేతలను నిలదీయండి


నర్సంపేట రూరల్: మాట్లాడుతున్న సుధాకర్


ఖానాపురం: మాట్లాడుతున్న ప్రతాప్

- మహబూబాబాద్ పార్లమెంట్ పాలక్ కట్ట సుధాకర్

నర్సంపేట రూరల్ : పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి, మాట తప్పిన టీఆర్ఎస్ నాయకులను గ్రామాల్లో నిలదీయాలని మహబూబాబాద్ పార్లమెంట్ పాలక్ కట్ట సుధాకర్, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. నర్సంపేటలోని ద్వారకపేటలో బుధవారం రాత్రి శక్తి కేంద్ర స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథులకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు నూకలు చెల్లిందని బీజేపీ చేపట్టిన ప్రజాగోస-బీజేపీ భరోసా యాత్ర కార్యక్రమం విజయవంతమవుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో నర్సంపేట గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్

ఖానాపురం : ఎన్నికల ముందు అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ మండల ఇన్‌చార్జ్ కంభంపాటి ప్రతాప్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మంగళవారిపేటలో ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో చేరికల కమిటీ అధ్యక్షుడు గటిక అజయ్, మండల కన్వీనర్ జల్లి మధు, వెంకన్న, శ్రీను, మల్లారెడ్డి, వెంకన్న, రహమాన్, షేక్‌సలీం, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


క్రీడా దుస్తులు అందజేస్తున్న బాధ్యులు

వరంగల్ (పర్వతగిరి) : యువత క్రీడల్లో రాణించాలని వైఎస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో ఆడుతున్న పర్వతగిరి టీం సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ బొట్ల మధు స్పాన్సర్ చేసిన టీ షర్ట్‌ను గురువారం రాజేశ్వర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.

నాటిన ప్రతి మొక్కకూ లెక్క

- కొండాపూర్ నుంచే శ్రీకారం
- ఆదర్శంగా నిలుస్తున్న జీపీ కార్యదర్శి


నంబర్ కేటాయించిన మొక్కలు

నల్లబెల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటడడంతో పాటు బృహత్ పల్లె ప్రకృతి వనాలు, మంకీ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని అధికారులు చెబుతున్నారు. కానీ చాలా చోట్ల ఆచరణలో లేకపోవడంతో అభాసు పాలవుతుందనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. మొక్కల సంరక్షణ సక్రమంగా లేకపోవడంతో వాటి పెంపకం కాగితాలకే పరిమితంగా ఉండేది. ఈ విమర్శలను తిప్పికొట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని నిర్ణయించుకున్నారు. నాటిన ప్రతి మొక్కను లెక్కించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మండలంలోని మూరుమూల గిరిజన గ్రామం కొండాపూర్ నుంచి శ్రీకారం చుట్టారు. మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ ప్రోత్సాహం, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో పంచాయతీ కార్యదర్శి రజిత నాటిన ప్రతి మొక్కను లెక్కిస్తూ నంబర్ కేటాయించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి మొక్కకు నంబర్‌తో పాటు పని ఐడీ వివరాలు వెల్లడిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న నర్సంపేట, వరంగల్ డీఎల్‌పీఓలు వెంకటేశ్వర్లు, ప్రభాకర్ కొండాపూర్ గ్రామాన్ని ఇటీవల సందర్శించి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మొక్కలను లెక్కించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పంచాయతీ కార్యదర్శిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు లెక్కించే కార్యక్రమాన్ని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

లెక్కించిన మొక్కల వివరాలు..

కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇప్పటి వరకు పండ్లు, పూలు, అటవీఉత్పత్తులతో పాటు నీడనిచ్చే 46 వేల మొక్కలకు నాటారు. ప్రతి మొక్కకు నంబర్ కేటాయించి వివరాలు వెల్లడించారు. బృహత్ పల్లె ప్రకృతి వనంలో 24వేలు, పార్కులో 4వేలు, మంకిఫుడ్ కోర్టులో 1,000, శ్మశాన వాటికలో 500, బర్లగడ్డ ప్రాంతంలో 500, బయో ఫెన్సింగ్‌లో 2వేలు, అవెన్యూ ప్లాంటేషన్ 6వేలు, ఫారెస్టు స్ట్రెంచ్ వెంట 8 వేల మొక్కలు నాటి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు.

ప్రతి మొక్కనూ లెక్కించాం..



అధికారుల సూచనల మేరకు గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన ప్రతి మొక్కనూ లెక్కించాం. 46 వేల మొక్కలకు నంబర్లు కేటాయించాం. నంబర్ కేటాయించిన మొక్క ఎండిపోతే దాని స్థానంలో మరో మొక్కను నాటిస్తాం. గ్రామస్తుల సహకారంతో మారుమూల గిరిజన గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

- రజిత, పంచాయతీ కార్యదర్శి, కొండాపూర్

అన్ని గ్రామాల్లో చేపడుతాం..



కొండాపూర్ గ్రామంలో మొక్కలను లెక్కించే కార్యక్రమాన్ని చేపట్టాం. ఇదే స్ఫూర్తితో సమన్వయంతో ముందుకు సాగుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలను లెక్కించే కార్యక్రమాన్ని చేపట్టి హరితహారం కార్యక్రమంలో నల్లబెల్లి మండలాన్ని ఉమ్మడి జిల్లాలోనే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తాం.

- కూచన ప్రకాశ్, ఎంపీఓ, నల్లబెల్లి